సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



'ఐ'న వాళ్లమే అంతా..

నేత్రదానం చేయగలిగితే అందరికి అందరం 'ఐ'నవాళ్లమే అవుతాం. నేత్రదానంతో చీకట్లను తొలగించగలుగుతాం. - 8లో



పుట్టపర్తి మందిరానికి..

పుట్టపర్తి సత్యసాయి మందిరానికి చాపర నుంచి ప్రసాదం వెళ్లనుంది. ఈ మేరకు ఆర్డర్ వచ్చింది. - 8లో

నాటుకోళ్లకు వింత వ్యాధి

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం కిష్టపురం పంచాయతీ బలరాంపురం గ్రామంలో గురువారం వింతవ్యాధి సోకి 95 నాటుకోళ్లు మృతి చెందాయి. మక్క చిన్నమ్మడు, బాకి పురుషోత్తం, మక్క తవుడుతో పాటు మరో 10 మంది స్థానికులకు చెందిన నాటుకోళ్లు మేతకు తిరుగుతుండగానే రెక్కలు కొట్టుకుంటూ చనిపోతున్నాయని పెంపకందార్లు చెబుతున్నారు. కోటబొమ్మాళి, కురుడు పశు వైద్యాధికారులకు కోళ్ల మృతిపై సమాచారం ఇచ్చామని తెలిపారు.

న్యూస్‌రీల్

చింతబట్టికి గండి



పాలవలసకు సమీపంలో పడిన గండి

సరుబుజ్జిలి: యరగాం–పురుషోత్తపురం ఓపెన్ హెడ్ చానెల్‌కు అనుసంధానంగా మురుగు కాలువ నుంచి గల చింతబట్టికి పాలవలస సమీపంలో గురువారం గండి పడింది. దీని వల్ల పాలవలస, పురుషోత్తపురం, పెద్దపాలెం, చిన్నపాలెం, అలమాజీపేట, ఫకీర్‌సాహెబ్‌పేట, చెవ్వాకుల పేట గ్రామాలకు చెందిన సుమారు 400 ఎకరాల పంట భూమి ముంపు బారిన పడింది. గండ్లు పడుతున్న సమయంలో ఎగువ ప్రాంతాల నుంచి గుర్రపు డెక్కవచ్చి పొలాల్లో రోజులు తరబడి నిల్వ చేరి పంట పొలాలు పాడవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఏటా ఒకే చోట గండిపడుతున్నా, సంబంధిత అధికారులు తాత్కాలిక పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని అంటున్నారు.

విజిలెన్స్ ఎస్పీ బాధ్యతల స్వీకరణ



శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా బర్ల ప్రసాదరావు గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని రామలక్ష్మణ కూడలి సమీప గ్రాండ్ హోటల్ నాలుగో ఫ్లోర్‌లో ఉన్న కార్యాలయంలోని తన చాంబర్‌లో ఉదయం 11.30 గంటలకు చేరారు. ఈయన స్వగ్రామం పార్వతీపురం దగ్గరలో ఉన్న నర్సిపురం. 1989లో ఎస్‌ఐగా కోటబొమ్మాళిలో తొలిపోస్టింగ్ దక్కించుకోగా 1999లో సీఐగా ఉద్యోగోన్నతి పొంది సోంపేట, విజిలెన్సు, విశాఖపట్నం సిటీ, గోపాలపట్నం, విశాఖ స్పెషల్ బ్రాంచి, ఏసీబీల్లో చేశారు. మళ్లీ ఉద్యోగోన్నతిపై 2009 జిల్లా విజిలెన్సు డీఎస్పీగా చేరి విశాఖ సిటీ, ఏసీబీ, ఎయిర్‌పోర్టు, పెందుర్తి, గోపాలపట్నం, కంచరపాలెం, కోస్టల్ సెక్యూరిటీ, మెరైన్‌ల్లో చేసి కాశీబుగ్గ డీఎస్పీగా 2018లో చేరారు. అనంతరం డీజీపీ హెడ్ ఆఫీస్‌లో నాలుగున్నరేళ్ల పీసీఎస్ అడిషనల్ ఎస్పీగా చేసి ఉద్యోగోన్నతిపై విజిలెన్సు ఎస్పీగా మన జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా కలిసిన 'సాక్షి'తో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదాయం సమకూరే వనరుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటామని, వీటిని గండి కొట్టేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

పలాస కిడ్నీ ఆస్పత్రి వద్ద సిబ్బంది నిరసన



పలాస కిడ్నీ ఆస్పత్రి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య సిబ్బంది

కాశీబుగ్గ: వైద్యారోగ్యశాఖ పరిధిలోని అర్హత లేని ఏఎన్‌ఎంలకు ఏడాదిన్నర శిక్షణ అనంతరం జీఎన్‌ఎంల హోదా కల్పించడం అన్యాయమని నర్సింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. వారి క్రమబద్ధీకరణకు జీఓ 115 జారీ చేయడం దారుణమన్నారు. పలాస డాక్టర్ వైఎస్‌ఆర్ కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ కేంద్రం ఆవరణలో నల్లా బ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన తెలిపారు. తాము జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి స్టాఫ్‌నర్సులుగా ఎన్నో ఏళ్లుగా ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్నా క్రమబద్ధీకరణకు నోచుకోలేకపోయామన్నారు. ఈ నెల14 నుంచి దశల వారీ ఆందోళనతో విధులు బహిష్కరిస్తామన్నారు.

నైరాలో పీజీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: ఆచార్య ఎన్‌జీ రంగా నైరా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వ్యవసాయ కళాశాల డీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 35 ఏళ్లు పూర్తి చేసుకున్న వారు 2024–25కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఇందులో సస్యపోషణ (అగ్రోనమి)లో ఆరుసీట్లు, జన్యుశాస్త్రం, మొక్కల ప్రజనన శాస్త్రం (జెనిటిక్స్ ప్లాంట్ బ్రీడింగ్), కీటక శాస్త్రం (ఎంటమాలజీ) వ్యవసాయ విస్తరణ విద్య (అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్) విభాగాల్లో 3 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఎన్‌ఆర్‌ఐ కోటా సంవత్సరానికి రూ.8లక్షల ఫీజుతో కొన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు నైరా వ్యవసాయ కళాశాలను సంప్రదించాలన్నారు.

డేంజర్ జోన్



ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు జిల్లా కేంద్రంలో ఏ దారిలో అయినా ప్రయాణించవచ్చు గానీ.. ఉమెన్స్ కాలేజీ రోడ్డుకు వెళ్లకూడదని అంటారు. ఒక వృద్ధుడు ఇక్కడ రోడ్డు దాటడం అంటే మరణ గండం దాటినట్టే. ఓ చిన్న ఫ్యామిలీ మామూలు బండిపై ఈ మార్గం దాటాలంటే ఆయుష్షు రేఖ ఆ చివరి వరకు ఉండాల్సిందే. విశాలమైన ఈ రోడ్లను రేసింగ్ ట్రాక్‌లుగా భావిస్తూ ఆకతాయిలు ఇక్కడ రెచ్చిపోతున్నారు. అల్ట్రా మోడర్న్ బైకులతో విన్యాసాలు చేస్తూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. ఘోరాలు జరుగుతున్నా.. ప్రాణాలు పోతున్నా.. పోలీసులు హెచ్చరిస్తున్నా.. వారి తీరు మాత్రం మారడం లేదు. – శ్రీకాకుళం క్రైమ్

ఎందుకంత ప్రమాదం..?

ఉమెన్స్ కాలేజీ రోడ్డు నగరంలోనే అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒకటి. ఇక్కడ ఉమెన్స్ డిగ్రీ, జూనియర్స్ కళాశాలలు, గర్ల్స్ హైస్కూల్‌లే కాక సమీపంలోనే డీఈఓ, డీపీఆర్‌ఓ, ఇతర కార్యాలయాలు, బ్యాంకులు, చర్చి, ఫుట్‌పాత్‌పై చిరువ్యాపారులతో రోడ్డు సందడిగా ఉంటుంది. కానీ ఇక్కడ ప్రమాదాలకు అసలు కారణం రోడ్లపై ఉన్న లోపాలతో పాటు కొందరు వాహనదారుల అతివేగం. ముఖ్యంగా విద్యాలయాలు తెరిచి, మూసే సమయాల్లో కొందరు ఆకతాయిలు ఇష్టానుసారం బైక్‌లతో విన్యాసాలు చేస్తూ ప్రాణాల మీదకు తెస్తున్నారు. అటుగా పోయేవారికి వీరి విన్యాసాలు తీవ్ర భయోత్పాతాన్ని కలిగిస్తుంటాయి.



గతేదాది డిసెంబరు 25న ఉమెన్స్ కాలేజీ మార్గంలో ప్రమాదానికి గురై మరణించిన వృద్ధుడు (ఫైల్)

ట్రాఫిక్ ఐలాన్ ఏర్పాటు చేస్తాం..



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి డివైడర్స్ ప్రాపర్‌గా ఉండేట్లు చూస్తాం. ట్రాఫిక్ ఐలాన్ ఏర్పాటు చేసి రెగ్యులర్‌గా కానిస్టేబుల్‌ను పెట్టి వాహనాల వేగాన్ని నియంత్రిస్తాం. రహదారి నిర్మాణ లోపం విషయం సంబంధిత ఇంజినీరుకు లెటర్ పెడతాం. విద్యార్థినులు, మహిళల భద్రత విషయమై ప్రత్యేక టీమ్‌ను ఫామ్ చేశాం. యువత, మైనర్ రైడింగ్‌లపై దృష్టిపెడతాం.

– సీహెచ్ వివేకానంద, డీఎస్పీ, శ్రీకాకుళం

కొన్ని ప్రమాదాలు..



- గత ఏడాది డిసెంబరు 25న నలుగురు మైనర్లు ఒకే ద్విచక్రవాహనంపై వెళ్తూ ఉమెన్స్ కాలేజీ రోడ్డు (మహలక్ష్మినగర్‌కు వెళ్లే మార్గం) మలుపులో కొండపల్లి పైడితల్లి అనే వృద్ధుడిని ఢీకొడితే ఆయన చనిపోయారు.
- గత ఏడాది డిసెంబరులో స్నేహితునితో కలిసి సరదాగా బైక్ వెనక్కి కూర్చొని వెళ్లిన పాపానికి బలగ రాంబాబు (30) అనే యువకుడు అతివేగానికి ఇక్కడే బలైపోయాడు.
- ఇటీవల ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఉమెన్స్ కాలేజీ రోడ్డు మలుపులోనే ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న సీనియర్ సిటిజన్‌ను ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు.



ఏం చేస్తే బాగుంటుంది..?

- ఇక్కడ నిరంతరం పోలీసు నిఘాతో పాటు వేగ నియంత్రణ ఏర్పాట్లు ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.
- మైనర్లు ఎక్కువగా బైక్‌లతో కనిపిస్తున్నారని, వీరికి కౌన్సెలింగ్ ఇవ్వాలనే అభిప్రాయాలు ఉన్నాయి.
- ప్రమాదాలు జరిగే ముఖ్య కూడళ్లు, మలుపులు వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలి.

వైద్య విద్యకు ప్రైవేటు ఉరి



- వైద్య విద్యను సామాన్యులకు దూరం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- మెడిసిన్ చదువులకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల్లో ఆందోళన

శ్రీకాకుళం న్యూకాలనీ:

వేల మంది పేద విద్యార్థుల మెడిసిన్ కలను రాష్ట్ర ప్రభుత్వం తన చేతులతో ఛిద్రం చేస్తోంది. ప్రభుత్వ కాలేజీల్లో చేరి వైద్య విద్య ను అభ్యసించాలనుకున్నవారి ఆశలపై నీళ్లు చల్లేలా చర్యలకు ఉపక్రమిస్తోంది. వైద్య కళాశాలలను ప్రైవే టు పరం చేసేలా చేసేందుకు సరికొత్త కుట్రలకు తెరతీసింది. ఈ విద్యా సంవత్సరంలో గత ప్రభుత్వం నిర్మించి సిద్ధం చేసిన వైద్య కళాశాలల్లో మెడికల్ చదువులు ప్రారంభమవుతాయని కోటి ఆశలతో ఎదురుచూస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆశలను కూటమి ప్రభుత్వం అడియాసలు చేసింది. ప్రభుత్వం తన నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



శ్రీకాకుళం రిమ్స్ మెడికల్ కాలేజ్

లేకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరిస్తున్నారు.

విద్యార్థుల్లో ఆందోళన..

ప్రభుత్వ నిర్ణయంతో ఇప్పటికే కొనసాగుతున్న వైద్య కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో కూడా ఆందోళన నెలకొంది. మున్ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు దుర్మార్గపు ఆలోచనలు ఎటువైపునకు దారితీస్తాయోనని వారు భయపడుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో రిమ్స్ మెడికల్ కాలేజీలో ఏడాదికి 150 సీట్ల చొప్పున భర్తీ చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ మెడికల్ కాలేజీలో 740 మందికి పైగా విద్యార్థులు వైద్య విద్యను అభ్యసిస్తున్నారు.

సామాన్యులకు చదువు దూరం



మేము శ్రీకాకుళం సమీపంలోని నవభారత్ సమీపంలో ఉంటున్నాం. నీట్–2024 రివైజ్డ్ ఫలితాల్లో స్థాయిలో ఆలిండియా స్థాయిలో 3198వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 1158వ ర్యాంకు వచ్చింది. దీంతో ఆలిండియా ర్యాంకుతో మంగళగిరి ఎయిమ్స్‌లో సీటు వచ్చింది, చేరాను. ప్రభుత్వ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులు మెడికల్ చదువులకే దూరమైపోతారు. ఈ విషయమై ప్రభుత్వ పెద్దలు పునరాలోచించాలి.

– తండ్రావు సుభాష్య, నీట్ ఆలిండియా ఓబీసీలో 1158వ ర్యాంకర్

భవిష్యత్ అగమ్యగోచరం



ప్రభుత్వ కాలేజీలతో రాష్ట్రంలో సామాన్యులకు కూడా వైద్య విద్యను అందించే సువర్ణ అవకాశం కలుగుతుంది. కానీ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో విద్యార్థులకు అగమ్యగోచర పరిస్థితి నెలకొంది.

– బోర గోపి, ఏబీవీపీ జిల్లా కన్వీనర్

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రూరల్ మండలం నుంచి చిలకపాలెం వైపు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎచ్చెర్ల పోలీసులు సీజ్ చేశారు. నవభారత్ వద్ద పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

గణాధీశాయ ధీమహి

చవితి ఉత్సవాల్లో భాగంగా స్వామికి వినూత్న రూపాల్లో అర్చనలు చేస్తున్నారు. దీపారాధనలతో వీధులన్నీ కాంతులతో కళకళలాడుతున్నాయి. అలాగే ప్రత్యేక అలంకరణలతో స్వామి మెరిసిపోతున్నారు.

–శ్రీకాకుళం కల్చరల్, శ్రీకాకుళం రూరల్



రిమ్స్ రోడ్డులో ప్రమిదలతో కూడిన దీపారాధన



బలగ కాలభైరవ పీఠం వద్ద గణపతికి దూర్వాలతో అర్చన

కొత్తమ్మ తల్లి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: అక్టోబర్ 1 నుంచి 3 వరకూ మూడు రోజులపాటు కోటబొమ్మాళిలో జరగనున్న కొత్తమ్మ తల్లి జాతరను రాష్ట్రస్థాయి పండగగా నిర్వహిస్తామని, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆయన గురువారం సాయంత్రం గుడి ఆవరణలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి కొత్తమ్మ తల్లి ఉత్సవాల నిర్వహణపై సమీక్షించారు. విద్యుత్ అలంకరణ, ఉచిత ప్రసాదం, క్యూలైన్లు, తాగునీటి ఏర్పాట్లు, 25 వేల మందికి అన్నదానం కౌంటర్ల ఏర్పాట్లతో పాటు సరిపడా ఆర్టీసీ బస్సులు నడపాలని, వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం గుడిలో కోడి, మేక మొక్కులకు గాను రూ.50, రూ.300 టికెట్ల రుసుమును రద్దు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ తాను గతంలో విజయవాడ కనకదుర్గ గుడి ఉత్సవాలను చూశానని, తనకు జాతర నిర్వహణపై అవగాహన ఉందని అధికారులను సమన్వయం చేసి కొత్తమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఎంహెచ్‌ఓ బొడ్డేపల్లి మీనాక్షి, తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్, ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి తనిఖీ కమిటీ ఏర్పాటు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అచ్యుతాపురం ఫార్మా సిటీలో ఎసైన్షియా సైన్సెస్ కర్మాగారంలో జరిగిన ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని శ్రీకాకుళం జిల్లాలో గల పరిశ్రమల్లో భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు, ఆయా పరిశ్రమల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించేందుకు జిల్లా స్థాయి తనిఖీ కమిటీ ఏర్పాటు చేసినట్లు కర్మాగారాల ఉప ముఖ్య తనిఖీ అధికారి టి.రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో ఈ కమిటీ పని చేస్తుందని, కమిటీ సభ్యులుగా డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, జిల్లా అగ్నిమాపక అధికారి, డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్, విజయనగరం, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్, విశాఖపట్టణం, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్, శ్రీకాకుళం మెంటర్స్‌గా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, శ్రీకాకుళం మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారన్నారు. వీరు రానున్న 30 రోజుల పాటు ఎపిటోరియ ఫార్మా లిమిటెడ్, ఆంధ్ర ఆర్గానిక్ లిమిటెడ్, మహదాన్ అగ్రిటెక్ లిమిటెడ్, నాగార్జున అగ్రికం లిమిటెడ్, డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీస్ పరిశ్రమల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తారన్నారు.

జాతీయ లోక్ అదాలత్ ఓ సువర్ణావకాశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్ 14వ తేదీన నిర్వహించనున్నామని, అధిక కేసులు రాజీ చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. ఈ అదాలత్ ఓ సువర్ణావకాశమని, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసుకొని కొత్త జీవితం అవలంబించడానికి సరికొత్త మార్గమని ఆయన పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



మండలంలోని మామిడిపల్లి సమీపంలో ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తప్పడంతో 30 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. శ్రీకాకుళం నుంచి సోంపేటకు వస్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ గురువారం మధ్యాహ్నం మామిడిపల్లి వద్ద స్టీరింగ్ పట్టేయడంతో బ్రేక్ ఫెయిల్ అయ్యింది. దీంతో డ్రైవర్ బీటీ నాయుడు చాకచక్యంతో నెమ్మదిగా పక్కన ఉన్న పొలాల్లోకి బస్సు దింపి ఆపాడు. దీంతో ప్రయాణికులు ఎలాంటి ప్రమాదం లేకుండా బయటపడ్డారు. అక్కడే ఉన్న రైతులు సాయం చేశారు.

– సోంపేట

సముద్రపు ఇసుక తరలిస్తున్న లారీ బోల్తా



మండలంలోని బొంతలకోడూరు పంచాయతీలో గల పెద్ద రుప్పపేట గ్రామంలో సముద్రపు తిన్నెల నుంచి అక్రమంగా సముద్ర ఇసుక లోడు చేసి వెళ్తున్న లారీ గురువారం బోల్తాపడింది. గత కొన్ని రోజులుగా ఇక్కడ నుంచి విశాఖపట్నంకు సముద్రపు ఇసుక తరలిస్తున్నారు. వాస్తవంగా ఈ ఇసుక భవన నిర్మాణాలకు ఉపయోగపడదు. అయితే నది ఇసుక అని చెప్పి అక్రమార్కులు విశాఖలో అమ్ముతున్నారు. లారీ తిరగబడంతో మరోసారి సముద్ర అక్రమ ఇసుక తరలింపు వెలుగులోకి వచ్చింది.

– ఎచ్చెర్ల క్యాంపస్

క్లుప్తంగా

తవిటమ్మ నేత్రాలు సజీవం


నేత్రదాత తవిటమ్మ

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని న్యూ కాలనీ వద్ద గల సాయి పార్వతి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న కిల్లంశెట్టి తవిటమ్మ(74) అనారోగ్య కారణంగా గురువారం మృతి చెందారు. మరణానంతరం ఆమె నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో ఆయన కుటుంబ సభ్యులు ఎస్ ఎస్ జువలరీస్ అధినేతలు సత్యనారాయణ, శ్రీనివాస్, సురేష్ నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ విషయం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేయగా, నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, సహాయకులు నంది ఉమాశంకర్‌లు కార్నియాలను సేకరించారు. వీరి నేత్రాలను విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాతల కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు అభినందించారు. నేత్రదా నం చేయాలనుకునే వారు 7842699321 నంబరుకు కాల్‌చేయాలని కోరారు.

ఐదు కిలోల కణితి తొలగింపు


తొలగించిన 5 కేజీల కణితి ఇదే

కాశీబుగ్గ: పలాస కిడ్నీ ఆస్పత్రిలో గురువారం వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. వజ్రపుకొత్తూరు మండలం గరుడభద్ర గ్రామానికి చెందిన యండమూరి సరసమ్మ అనే మహిళ కడుపులో 5 కేజీల కణితితో ఇబ్బందులు పడుతుండగా ఆపరేషన్ చేసి తొలగించారు. ఈ ఆపరేషన్‌ను ప్రసూతి వైద్యులు డాక్టర్ కవిటి సాహితి, మత్తు డాక్టర్ తృప్తిలు ఆరోగ్యశ్రీ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులను సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ, సివిల్ సర్జన్ మెడికల్ రెసిడెంట్ ఆఫీసర్ డాక్టర్ కూన మోహన్ బాబు అభినందించారు. బయట ఈ ఆపరేషన్ చేయడానికి రూ.లక్ష ఖర్చు అవుతుందని పూర్తి ఉచితంగా చేసుకున్నామని తెలిపారు.

జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు గణేష్


గణేష్

కాశీబుగ్గ: వజ్రపుకొత్తూరు మండలం రాజాం పంచాయతీ ధర్మపురం గ్రామానికి చెందిన రెల్ల గణేష్ జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 20 నుంచి 22 వ తేదీ వరకు ముంబైలో జరగనున్న జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు గణేష్ హాజరవుతాడని శిక్షకుడు నెయ్యిల భాస్కరరావు తెలిపారు. ఈ నెల 8వ తేదీన గుంటూరులో జరిగిన 60 కిలోల బరువు విభాగంలో ప్రథమ స్థానం సాధించారు.

పాముకాటుతో మహిళ మృతి


ఖండ్యాపు లక్ష్మి (ఫైల్)

బూర్జ: బూర్జ గ్రామానికి చెందిన ఖండ్యాపు లక్ష్మి (53) పాము కాటుకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలియజేశారు. లక్ష్మి గురువారం సాయంత్రం గ్రామం దగ్గరలో విజయపురం వ్యవసాయ పొలంలో కలుపు తీయడానికి వెళ్లింది. చీకటి పడినా ఆమె ఇంటికి రాకపోవడంతో భర్త రాము గ్రామస్తులతో వెతడానికి వెళ్లారు. వ్యవసాయ పొలంలో పడి ఉండడం చూసి నిశ్చేష్టులయ్యారు. అప్పటికే ఆమె పాముకాటుతో చనిపోయి ఉంది. వెంటనే మృతదేహాన్ని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉంచి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. 108 వాహనంలో మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. భర్త రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ ఎం.ప్రవల్లిక కేసు నమోదు చేశారు.

13, 14 తేదీల్లో ఎన్‌సీఎస్‌టీ బృందం పర్యటన

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని శ్రీకాకుళం జిల్లాలోని మెళియాపుట్టి, జలుమూరు మండలాల్లో నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ బృందం ఈనెల 13,14 తేదీల్లో పర్యటించనున్నట్టు గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జాటోతు హుస్సేన్‌తో పాటు మరో ఆరుగురు బృందం పర్యటిస్తుందన్నారు. ఈ నెల 14న మధ్యాహ్నం 2 గంటలకు శ్రీకాకుళం కలక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీ, గిరిజన సంఘాల నాయకులతో వివిధ అంశాలపై చర్చిస్తుందన్నారు.

ఐన వాళ్లమే అంతా..

- నేత్రదానంతో ఎందరికో కొత్త బతుకు
- జిల్లాలో ఇప్పటివరకు రెడ్‌క్రాస్ ద్వారా 928 కార్నియాల సేకరణ
- 800 మందికి నేత్రాల అమరిక

శ్రీకాకుళం కల్చరల్: నేత్రదానం.. కళ్లు లేని ఓ చిన్నారికి అమ్మను చూపించగలదు. లోకం చూడలేని ఓ బుజ్జాయికి రంగులు చూపగలదు. చీకటి తప్ప ఇంకేమీ తెలియని బతుకుల్లో వెలుగులు నింపగలదు. కాసింత ఆరోగ్యం, మరికాసింత మానవత్వం ఉంటే చాలు.. అందరికీ అందరం 'ఐ'నవాళ్లమైపోతాం. అంధత్వాన్ని సమూలంగా నిర్మూలించగలం. ఇటీవల కాలంలో నేత్రదానం, రక్తదానం, అవయవ దానంపై ఎక్కువ ప్రచారం జరుగుతోంది. చనిపోయిన వ్యక్తి నేత్రాలను దానం చేస్తే ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించవచ్చు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 2008 ఏర్పాటు చేసిన నేత్ర సేకరణ కేంద్రం జిల్లాలో కార్నియాలను సేకరిస్తోంది.

నేత్ర సేకరణ కేంద్రం కోసం..

జిల్లా లో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నేత్రసేకరణపై ఇటీవల కాలంలోఅవగాహనలు పెంచుతున్నారు. చనిపోయిన వారి నేత్రాలు బతికున్నవారికి దానం చేయడం వాద్వారా వారికి చూపు ఇచ్చినట్లు అవుతుందని తెలియ చెబుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో 2001 నుంచి అవగాహన జరుగుతోంది.


మగటపల్లి కళ్యాణ్ నేత్రసేకరణ కేంద్రం, శ్రీకాకుళం

నేత్ర సేకరణ అంటే..

నేత్రదానం అనే సరికి మరణించిన వ్యక్తి కళ్లు పూర్తిగా తీసేస్తారనే భావం అందరిలో ఉంటుంది. ఇది అపోహ మాత్రమే. మనిషి చనిపోయిన 6 గంటల నుంచి 8 గంటల్లోగా కళ్లలోని ఒక పొరను మాత్రమే సేకరిస్తారు. దాన్నే కార్నియా అంటారు. మిగిలిన కన్ను అంతా అలాగే ఉంటుంది.

నేత్రదానానికి సమాచారం కోసం..

జిల్లాలో ఎవరైనా నేత్రదానం చేయాలంటే సేకరణ కేంద్రం ఉంది. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఉన్న మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం, మరొకటి ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి, సోంపేటకు తెలియజేయాలి.

వారిని సంప్రదించాలంటే ఫోన్ నంబర్
7842699321,
బ్లడ్ బ్యాంకు నంబర్లు
08942-226555, 9440195900.


చూపు రాకముందు, తరువాత

నేత్రదానానికి ఎవరి నేత్రాలు పనికిరావు..?

ఎయిడ్స్, హెపటైటిస్ బి(పచ్చకామెర్లు), ర్యాబిస్, పాముకాటు, బ్లడ్ కేన్సర్, సెప్టిసీమియా లాంటి వ్యాధులు ఉన్నవారి నేత్రాలు దానానికి పనికిరావు. మిగిలిన వారందరూ అర్హులే.

928 కార్నియాల సేకరణ

రెడ్‌క్రాస్ నేత్ర సేకరణ ద్వారా ఇప్పటికి 928 కార్నియాలను సేకరించి 800మందికి చూపు ప్రసాదించేలా కృషిజరిగింది. ఇది రెడ్‌క్రాస్ గొప్పదనం మాత్రమే కాదు. ప్రజలలో పెరుగుతున్న అవగాహనను నిదర్శనంగా చెప్పవచ్చు. ఇంకా ఎంతో మంది అవసరం. కానీ దాతలలో ఇంకా అవగాహన పెరగాల్సి ఉంది. ఇప్పటికి 4వేల మందికి పైగా తమ నేత్ర దానం కోసం ధ్రువీకరణ పత్రాలను అందించారు.

నేత్ర సేకరణకు ప్రత్యేక శ్రద్ధ



నేత్ర సేకరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. దాత ఫోన్ రాగానే వెంటనే స్పందించి మా టెక్నీషియన్‌ను అక్కడికి వ్యాన్ ద్వారా పంపుతున్నాం. సేకరణలో ఆధునిక మెలకువలు పాటిస్తున్నాం. కార్నియాలు అమర్చిన వారు చక్కగా చూడగలుగుతున్నారు.

– పి.జగన్మోహనరావు, రెడ్‌క్రాస్ చైర్మన్

నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నాం



నేత్ర దానం ప్రతి కుటుంబానికి సంప్రదాయం కావాలి. ప్రతి మండల పరిధిలోని గ్రామాల్లో పారామెడికల్ ఆఫ్తాలమిక్ అధికారుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. సమావేశాలు, ర్యాలీలతో పాటు విద్యార్థులకు పోటీలు పెడుతున్నాం. కళ్ల వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. – డాక్టర్ కె.త్రినాథరావు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్, అంధత్వ నివారణ సంస్థ,శ్రీకాకుళం

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలు

ఇచ్ఛాపురం /రూరల్: పేదలకు ప్రభుత్వం ఇచ్చిన పీడీఎస్ బియ్యం పక్కదారి పడుతోంది. కొంత మంది వ్యాపారులు లబ్ధిదారుల వద్ద కొనుగోలు చేస్తూ పీడీఎఫ్ బియ్యంను ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు చేరవేసి, అక్కడ నుంచి రైలు మీద ఒడిశా ప్రాంతాలకు తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పౌరసరఫరాల అధికారులు స్పందించారు. గురువారం వేకువ జామున ఐదు గంటలకు సీఎస్‌డీటీ సంతోష్‌కుమార్ తన సిబ్బంది రైల్వే స్టేషన్‌కు చేరుకొని బియ్యం మూటలను పట్టుకున్నారు. వీటిని తరలిస్తున్న పట్టణం ఉప్పల వీధికి చెందిన గేదెల ధనలక్ష్మీతో పాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. 34 ప్లాస్టిక్ బ్యాగుల ద్వారా 14 క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకుని ఎంఎల్‌ఎస్ ఇన్‌చార్జికి అప్పగించి కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ ఎస్.వెంకటరావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నెల రేషన్ బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు వ్యాపారులకు బియ్యం అమ్మకాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందితే సంబంధిత లబ్ధిదారుల రేషన్ కార్డును రద్దు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుల జిల్లా పర్యటన రేపు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వాబ యోగేశ్వరరావు

సారవకోట: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ జిల్లాలో పర్యటించనున్నట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగేశ్వరరావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జలుమూరు మండలంలోని ఎస్టీ మాకివలస, మెళియాపుట్టి మండలంలోని కేరశింగి గూడ గ్రామాల్లో 14వ తేదీన పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. ఆయనతో పాటు గిరిజన నాయకులు బెజ్జి కృష్ణారావు, జన్ని దాలయ్య, మన్మధరావు, లక్ష్మణ తదితరులున్నారు.

విశాఖ స్పోర్ట్స్ అకాడమీకి నరసన్నపేట విద్యార్థిని


దివ్యధాత్రితో పాటు తల్లిదండ్రులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పి.దివ్యధాత్రి వాలీబాల్ విభాగంలో విశాఖ స్పోర్ట్స్ అకాడమీకి ఎంపికైంది. వారం క్రితం విశాఖ పోర్టు స్టేడియంలో స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎస్ఏఐ) ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు.

ఇందులో దివ్యధాత్రి మెరుగైన ఆటతీరు కనబరిచి జిల్లా నుంచి అకాడమీకి ఎంపికైంది. ఈమేరకు స్కూల్ హెచ్ఎం వెంకటరావు గురువారం తెలిపారు. దివ్యధాత్రితో పాటు తల్లిదండ్రులను గురువారం స్కూల్‌లో సత్కరించారు. నరసన్నపేట లయన్స్ క్లబ్ ప్రతినిధి ఊణ్ణ రంగనాథ్ రూ. 2500 నగదు బహుమతిని ఇచ్చారు.

చెరువులో పడి ఉపాధి వేతనదారుడు మృతి


చెరువులో పడి మృతి చెందిన సన్యాసిరావు

రణస్థలం: మండలంలోని పిషిణి పంచాయతీలో గల పతివాడపాలెం గ్రామానికి చెందిన సోపేటి సన్యాసిరావు(53) అనే ఉపాధి హామీ వేతదారుడు చెరువులో పడి మృతి చెందాడు. జేఆర్ పురం పోలీసులు, ఉపాధిహామీ వేతనదారులు తెలిపిన వివరాలు ప్రకారం.. పతివాడపాలెంలో గ్రామంలో గల పెద్ద చెరువులో ఎన్ఆర్‌జీఎస్ పనుల్లో భాగంగా చెరువు గట్టుపై గురువారం తుప్పలు కొట్టారు. ఇంటికి వెళ్లే సమయంలో సాయంత్రం 5 గంటలకు కాళ్లు, చేతులు కడుక్కోవాలని సన్యాసిరావు చెరువులో దిగి ప్రమాదవశాత్తు జారిపడి మునిగిపోయాడు. మృతుడికి ఈత రాకపోవడంతో పాటు చెరువు లోతుగా ఉండటం వల్ల వెంటనే మునిగి చనిపోయాడు. మృతుడికి భార్య గన్నెమ్మ, వివాహాలైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య గన్నెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రమాదంపై ఎన్ఆర్‌జీఎస్ జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు ఏపీఓ శ్రీనివాసనాయుడు చెప్పారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తికి గాయాలు

నందిగాం: మండలంలోని మద్దిలివాని పేట సమీపంలో గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొని పెద్దతామరాపల్లికి చెందిన టొంప రమణయ్య(54) తీవ్రంగా గాయపడ్డారు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రమణయ్య పెద్దతామరాపల్లి నుంచి మద్దిలివానిపేటలో ఉన్న తన పొలం చూడడానికి సైకిల్‌పై వెళ్తుండగా టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో రమణయ్య కింద పడిపోయాడు. స్థానికులు రమణయ్యను టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుడు రమణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహ్మద్ అమీర్ అలీ కేసు నమోదు చేశారు.

ప్లాంటేషన్ పూర్తికి ఆదేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని తక్షణమే పూర్తి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ చిట్టి రాజు సిబ్బందిని ఆదేశించారు. గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 17వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న వన మహోత్సవాలు కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని సిబ్బంది చేపట్టాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ప్రతి మండలంలోని కనీసం 20 రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలను చేపట్టాలన్నారు.

19 నుంచి 21 వరకు క్విజ్ పోటీలు

ఎచ్చెర్ల క్యాంపస్: రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా స్థాపించి 90 ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా ఆన్‌లైన్‌లో జాతీయ స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్యకిరణ్ గురువారం తెలిపారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ ఎస్ఎంపురం క్యాంపస్‌లో గురువారం క్విజ్ పోటీలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు క్విజ్ పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయి, సౌత్ ఇండియా, జాతీయ స్థాయి విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్‌బిఐ90.క్విజ్.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎల్‌డీఎం ఉమాశంకర్, బ్యాంకు అధికారులు రవిబాబు, లక్ష్మీనారాయణ, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

పుట్టపర్తి మందిరానికి చాపరలో ప్రసాదం తయారీ



ప్రసాదం తయారు చేస్తున్న చాపర గ్రామానికి చెందిన తయారీదారులు (ఇన్‌సెట్లో) తయారు చేసిన బాల్సాలు

మెళియాపుట్టి: పుట్టపర్తి సత్యసాయి మందిరం కోసం ప్రసాదం తయారు చేసి పంపించాలని చాపర గ్రామానికి చెందిన నెయ్యిల లక్ష్మి, కృష్ణ దంపతులకు అవకాశం వచ్చినట్టు వారు తెలిపారు. పుట్టపర్తి ఆలయంలో భక్తులకు అందించడానికి లడ్డూ, కాజా, బాల్సా వంటి రకాలు 10500 పీసులు తయారుచేసి పంపించాలని వారికి పిలుపు వచ్చింది. దీంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.70వేలు విలువ చేసే ప్రసాదాలను సత్యసాయి మందిరానికి తయారుచేసి అందించ డంపై తయారీదారులతో పాటు గ్రామస్తులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. అత్యంత నాణ్యత, రుచికరంగా తయారు చేసి రెండురోజుల్లోనే సత్యసాయి సన్నిధికి పంపిస్తామని తయారీదారులు తెలిపారు.

ఇది మా అదృష్టం



చాపర పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శైలజారాణి వల్ల ఈ అవకాశం వచ్చింది. లాభాలు ఆశించకుండా నాణ్యతతో తయారు చేస్తాం. నాకు తెలిసి శ్రీకాకుళం జిల్లాలో మొట్టమొదటిసారి ఈ అవకాశం మాకే దక్కిందని అనుకుంటున్నాం. చాలా సంతోషంగా ఉంది. సత్యసాయి మందిరానికి అందించడానికి తయారుచేస్తున్న ప్రసాదం కావడంతో నిష్ట నియమాలతో ఉన్నాం. తయారు చేసిన ప్రసాదం నచ్చితే మాకు మళ్లీ అవకాశం వస్తుందని ఆశిస్తున్నాం.

– నెయ్యిల లక్ష్మి, ప్రసాదం తయారీదారు చాపర గ్రామం

గోడ కూలి వ్యక్తి మృతి


మృతి చెందిన వీరయ్య (ఫైల్)

సారవకోట: మండల కేంద్రంలోని రెల్లివీధిలో ఇంటి గోడ కూలి కోటిపల్లి వీరయ్య (65) బుధవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. వర్షాలకు ఇంటి గోడ బాగా నానిపోవడంతో బుధవారం అమాంతం వీరయ్యపై కూలిపోయింది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. తొలుత ఆయనను నరసన్నపేట ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కెజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య సింహాద్రి, వివాహితులైన నలుగురు పిల్లలున్నారు. కూలిపోయిన ఇంటి గోడను ఆర్ఐ బేగం వీఆర్వో గౌరమ్మ పరిశీలించారు.

వైఎస్ జగన్‌ను కలిసిన స్వరూప్



మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంవీ స్వరూప్ గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారని, పార్టీ కార్యకర్తలకు అండగా ఉండాలని సూచించారని స్వరూప్ తెలిపారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

ఆడ దూడల పథకం వినియోగించుకోండి


చిట్టివలసలో లేగదూడల ప్రదర్శనలో పాల్గొన్న డీడీ దామోదరరావు

ఆమదాలవలస: తొంభై శాతం కచ్చితత్వంతో ఆడ దూడలు పుట్టేలా చర్యలు చేపడుతున్నామని, దాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుగణాభివృద్ధి శాఖ జిల్లా కార్యనిర్వాహక అధికారి (డీడీ)ఎన్. దామోదర్ అన్నారు. మండలంలోని చిట్టివలస గ్రామంలో గర్భస్థ కోశ చికిత్స, లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేసే పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ పథకానికి మంచి పశువుల ఎన్నికకు రైతులకు అవగాహన కోసం గ్రామంలో అన్ని పశువులను పరీక్షించినట్లు తెలిపారు. రూ.1350 విలువ గల రెండు వీర్య నాళికలు రూ.850, సబ్సిడీ పోగా రూ.500 మాత్రమే రైతులు ప్రభుత్వానికి చెల్లిస్తే ఆడ దూడలను పొందే వీర్య నాళికలను ప్రభుత్వం సరఫరా చేస్తుందని తెలిపారు. వీర్య నాళికలు ఉపయోగించిన తర్వాత కూడా ఆవులు చూడు కట్టకుంటే రైతులు చెల్లించిన రూ.500 తిరిగి వారికే ఇచ్చేస్తామని తెలిపారు. ఆడ దూడకు బదులుగా మగ దూడ జన్మిస్తే రూ.250 తిరిగి రైతుకు అందజేస్తామని తెలిపారు. భవిష్యత్‌లో ఈ లింగ నిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా 42 పశువులకు గర్భ కోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించారు. లేగ దూడల ప్రదర్శనలో భాగంగా 28 దూడలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో భాగంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన పాడి రైతులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.ఆనందరావు, అక్కులపేట పశు వైద్యాధికారిణి డాక్టర్ వై.హేమలత, పశు వైద్యులు డాక్టర్ ఓంకార్, డాక్టర్ శరత్ చంద్ర, సిబ్బంది కళ్యాణి, సూర్యారావు, సూర్యమోహన్, గ్రామపెద్దలు గుజ్జల లక్ష్మణరావు, బంటుపిల్లి నారాయణరావు, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఓకు గాయాలు


తీవ్రంగా గాయపడిన మామిడివలస సచివాలయం వీఆర్వో దూసి సంజీవరావు

బూర్జ: మండలంలో గల పెద్దపేట గ్రామ జంక్షన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మామిడివలస సచివాలయం వీఆర్వో దూసి సంజీవరావుకు తీవ్ర గాయాలయ్యాయి. విధులకు హాజరయ్యేందుకు పాలకొండ- శ్రీకాకుళం ప్రధాన రహదారిలో మోటారు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో బలంగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగినట్లు ఆయన తెలియ జేశారు. ముక్కుపై బలమైన గాయం తగలడంతో 108 వాహనంతో పాలకొండ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

అక్కడి నుంచి మెరుగైన వైద్యం వేటు హస్పటల్‌కు తరలించారు. అక్కడ నుంచి శ్రీకాకుళం తరలించారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.లక్ష ఆర్థిక సాయం అందజేత


లక్ష్మణరావు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పోలీస్ అసోసియేషన్ సభ్యులు

రణస్థలం: జిల్లాలోని సాయుధ దళంలో పనిచేస్తూ అనారోగ్యంతో ఈ నెల 1వ తేదీన కానిస్టేబుల్ ఎం. లక్ష్మణరావు మృతి చెందాడు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అసోసియేషన్ తరఫున డెత్ రిలీఫ్ ఫండ్ ద్వారా తక్షణ ఆర్థిక సాయంగా ఒక రూ.లక్ష చెక్‌ను లక్ష్మణరావు భార్య సరస్వతికి గురువారం అందజేశారు. చెక్కు అందజేసిన వారిలో జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్ష, కోశాధికారులు ఆర్.కృష్ణంనాయుడు, కె.భుజంగరావు, కార్యవర్గ సభ్యులు నర్సింహులు, బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

నైవేద్యం సమర్పయామి..

హిరమండలంలోని కైవాడ వీధిలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం యువకులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 రకాల పిండివంటలను నైవేద్యంగా నివేదించారు. అనంతరం గణపతి ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు. – హిరమండలం

